నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

హైదరాబాద్, సోమవారం 26 మే 2025 RANGAREDDY

# నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

**రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

చేవెళ్లటౌన్, మే 25 : నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు డీలర్లను హెచ్చరించారు. ఆదివారం చేవెళ్లలోని రైతు వేదికలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై డీలర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. వ్యాపార ప్రయోజనాల కోసం అడ్డదారులు తొక్కే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని.. అవసరమైన పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు హరినాథ్, సురేశ్‌రావు, డీలర్లు పాల్గొన్నారు.

# అందరినోట విజయలక్ష్మి మాటే..!

- మండలంలో జోరుగా ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై చర్చ
- నారాయణపూర్ దవాఖానకు తరలిన కుటుంబసభ్యులు
- స్వగ్రామానికి రానున్న భౌతికకాయం



విజయలక్ష్మి (ఫైల్)



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ సమయంలో విజయలక్ష్మిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

కేశంపేట, మే 25 : ఏ నలుగుర్ని కదిలించినా ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పైనే చర్చించుకుంటున్నారు. మండలంలోని వేముల్‌నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ భూమిక(40) ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిందన్న వార్త ప్రచారం నేపథ్యంలో అందరూ ఆమె గురించే చర్చించుకుంటున్నారు. ఎన్‌కౌంటర్ విషయం తెలియగానే మొదట్లో కంగారుపడి భయాందోళనకు గురైన మండల ప్రజలు మెల్లగా తేరుకొని సమాజ హితం కోసం ఆమె ఎంచుకున్న పోరాట పంథాపై మాట్లాడుకుంటున్నారు. మారుమూల పల్లెకు చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువతి ఉన్నత విద్యను అభ్యసించి.. అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తేందుకు ఆమె ఎంచుకున్న దారి, చూపిన తెగువ వెలకట్టలేనిదని కొనియాడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సాగిన మలి దశ ఉద్యమంలో విజయలక్ష్మి చురుగ్గా పాల్గొన్నదని.. ఉస్మానియా వేదికగా జరిగిన పలు ఆందోళన కార్యక్రమాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఫొటోలను మండలంలోని యువత షేర్ చేసుకుంటూ ఆమె పోరాట పటిమను గుర్తు చేసుకుంటున్నారు. విజయలక్ష్మి భౌతికకాయాన్ని గ్రామానికి తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులు మొదట్లో కొంత సంశయించినా సమాజం కోసం ఆమె తన ప్రాణాలను అర్పించిందని ప్రజా సంఘాలు, మేధావులు నచ్చజెప్పడంతో.. కుటుంబ సభ్యులు వేముల్‌నర్వ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలివెళ్లారు. ప్రభుత్వ నిబంధనలను పూర్తి చేసి ఆమె భౌతిక కాయాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.

**జాబితాల్లో తాము సూచించిన వారి పేర్లుండాలంటున్న కాంగ్రెస్ నాయకులు**

**అనర్హుల పేర్లను తొలగిస్తున్న ఆఫీసర్లు**

**ఇరువురి మధ్య కొనసాగుతున్న పంచాయితీ**

## అధికారులు VS నాయకులు

# కోల్డ్ వార్



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా అనర్హుల ఎంపికపై అధికారుల అసంతృప్తి

మిగిలిన వందలాది మంది లబ్ధిదారులకు గుండు సున్నానే..

- కేవలం 77 మందికే రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం..
- ఇండ్లు కూలగొట్టి.. అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు కొత్త ఇండ్ల నిర్మాణం
- మొదటి విడతలో 2,285 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- రెండో విడతకు కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ
- వికారాబాద్ జిల్లాలో అర్హులు..1,50,000 మంది..
- జిల్లాకు మంజూరైన ఇండ్లు 14,000

వికారాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా జరుగుతున్నది. అర్హుల ఎంపికకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో అందరూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే ఉండడంతో వారికి నచ్చినవారినే ఎంపిక చేస్తున్నారు. సీఎంతోపాటు మంత్రులు అర్హులనే ఎంపిక చేయాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతున్నది. ప్రతి గ్రామంలోనూ ఇండ్లు లేని నిరుపేదలు ఐదారుగురు మినహా ఉండరు, కానీ, ఒక్కో గ్రామంలో పదికి పైగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారిని ఎంపిక చేస్తున్నారనే విమర్శలున్నాయి. లబ్ధిదారుల ఎంపిక విషయంలో కొందరు మండల స్థాయి అధికారులు-కాంగ్రెస్ నాయకుల మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు సమాచారం. తాము సూచించిన వారి పేర్లు జాబితాల్లో ఉండాలంటూ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేస్తుండగా.. అర్హులనే ఎంపిక చేస్తామని అధికారులు తెగేసి చెబుతుండడంతో అధికారులు-కాంగ్రెస్ నాయకుల మధ్య పంచాయితీ నడుస్తున్నది. కాగా, జిల్లాలోని ఓ మండలంలో కాంగ్రెస్ నాయకులు తాము చెప్పిన వారి పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకుంటే బదిలీ చేయిస్తామని ఓ అధికారిని బెదిరించినా.. సదరు ఆఫీసర్ మాత్రం మీకు నచ్చినట్లు చేసుకోండి.. అర్హులను మాత్రమే ఎంపిక చేస్తామంటూ చెప్పి కాంగ్రెస్ నాయకులు చెప్పిన పేర్లను తొలగించి.. అర్హుల పేర్లను జాబితాలో పొందుపర్చినట్లు సమాచారం. దీంతో పలువురు కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యేను కలిసి సదరు అధికారిని వెంటనే బదిలీ చేయించాలని విజ్ఞప్తి చేయగా.. ఈ విషయం బయటకు తెలిస్తే నియోజకవర్గమంతటా వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఆ ఎమ్మెల్యే స్పందించలేదని సమాచారం.

### ఎంపిక ఏకపక్షం..

కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని పేదల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం నియమించిన కమిటీల్లో కాంగ్రెస్‌కు చెందినవారే ఉండడంతో వారికి అనుకూలంగా ఉన్న వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో ఏ సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టినా పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాల ఫలాలు అందాయని.. కానీ, కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే అందేలా చర్యలు తీసుకుంటున్నదని.. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగడంలేదని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన మొదటి విడత లబ్ధిదారుల జాబితాలోనూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారినే ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి.. పేదలకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రజాపాలనతోపాటు గతంలో స్వీకరించిన వాటిలో 2,50,000 దరఖాస్తులు రాగా వీటిలో 1,50,000 దరఖాస్తుదారులను అధికారులు అర్హులుగా తేల్చారు.


### 77 మందికే రూ. లక్ష సాయం..

ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. పైలెట్ ప్రాజెక్టు పేరిట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన సర్కార్.. పైలెట్ గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇండ్ల నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అయితే, లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగానే ఇండ్ల నిర్మాణానికి మొదటి విడతగా రూ. లక్ష సాయం పంపిణీ చేస్తామని చెప్పినా ఇప్పటికీ మంజూరు చేయలేదు. ప్రభుత్వం మాట నమ్మిన లబ్ధిదారులు పాత ఇండ్లను కూల్చి.. బేస్‌మెంట్ వరకు కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. కాగా, జిల్లాలో మొదటి విడతలో 2,285 ఇందిరమ్మ ఇండ్లకు అనుమతులు మంజూరైతే వాటిలో కేవలం 77 ఇండ్లకు మాత్రమే రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అందించిన ప్రభుత్వం మిగతా లబ్ధిదారులకు గుండు సున్నా చూపించింది. ఇండ్లు కూల్చేసి.. అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించి నెలలు గడుస్తున్నా ఇంకా సాయం అందకపోవడంతో పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారులందరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అందించామని ఎమ్మెల్యేలు మాట్లాడడంపై మండిపడుతున్నారు. దీంతో పైలెట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కాగా, సెగ్మెంట్‌కు 3,500 ఇండ్ల చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14,000 ఇండ్లు జిల్లాకు మంజూరయ్యాయి. వాటిలో మొదటి విడతలో 2,285 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయగా, రెండో విడతలో 2,929 ఇందిరమ్మ ఇండ్లకు పరిపాలన అనుమతులు మంజూరు కాగా, క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నది.

# భూములు లాక్కోవద్దు

- 50 ఏండ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్నాం
- వాటిని తీసుకుంటే రోడ్డునపడుతాం
- విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కొహెడ రైతులు

తుర్కయాంజాల్, మే 25 : 50 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నదని.. దీంతో తాము రోడ్డున పడతామని కొహెడ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడ రెవెన్యూ సర్వే నం.167/1 వద్ద రైతులు విలేకరులతో మాట్లాడారు. సర్వే నం.167/1లోని సుమారు 266 ఎకరాల భూమిని కొహెడకు చెందిన సుమారు వంద మందికి పైగా రైతు కుటుంబాలకు చెందినవారిమి గత 50 ఏండ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్నామన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు 266 ఎకరాలకు ఫ్రీకాస్ట్ వాల్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నించగా తాము అడ్డుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు 50 ఏండ్ల కిందట భూమి లేని కుటుంబాలకు వ్యవసాయం చేసుకుని బతుకుమని ఎకరా.. రెండు ఎకరాల చొప్పున కేటాయించగా.. అప్పటి నుంచి ఆ భూముల్లో జొన్నతోపాటు పలు రకాల పంటలను పండించుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఆ భూములను తీసుకుంటే తాము రోడ్డున పడతామని.. ప్రభుత్వం ఆలోచించి.. తమ భూముల జోలికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.



కొహెడ సర్వే నం.167/1 వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు



నీటి గుండంలా మారిన కొనుగోలు కేంద్రం, తడిసి ముద్దయిన వరికుప్పలు

# రైతన్న కష్టం నీటిపాలు

- బషీరాబాద్ మండలంలో భారీ వర్షం
- తడిసి ముద్దయిన.. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

బషీరాబాద్, మే 25 : రైతన్న ఆరుగాల కష్టం నీటిపాలవుతున్నది. వరిని పండించి.. తేమ శాతం తగ్గే వరకు కల్లాల్లో ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే.. అక్కడి సిబ్బంది పలు రకాల కొర్రీలు పెడుతుండటంతో అన్నదాత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలకు తూకం వేసేందుకు తీసుకొచ్చిన ధాన్యం.. అదేవిధంగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించని వడ్లు తడిసి ముద్దయ్యాయి. నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ధాన్యం వర్షపు నీటిలో తడిసిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఐదు కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కాశీంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఒకటి.. నవాంద్గి సహకార సంఘం ఆధ్వర్యంలో మైల్వార్, దామర్‌చేడ్, నవల్గా, నవాంద్గి గ్రామాల్లో మరో నాలుగు కేంద్రాలను ఓపెన్ చేశారు. నవాంద్గి, నవల్గా కొనుగోలు కేంద్రాలను మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడి కేంద్రాల నిర్వాహకులు తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించకపోవడంతో ఆదివారం సాయంత్రం కురిసిన వానకు తడిసిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పండించడం కంటే విక్రయించడమే గగనంగా మారిందని పేర్కొంటున్నారు. కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా నిర్వాహకులు కనికరించడం లేదని.. ధాన్యం తీసుకొచ్చిన అన్నదాతకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూకం వేసిన ధాన్యం తడిసిపోతే.. వాటిని మళ్లీ ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా మైల్వార్, దామర్‌చేడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లోనూ వర్షానికి ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు.

# నిధులు రాక నిర్వహణ అస్తవ్యస్తం

- పైసా విదల్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- భారమంతా కార్యదర్శులపైనే..
- అప్పులు చేసి మరీ సమస్యలు తీరుస్తున్న వైనం
- చేసిన అప్పులు తీర్చడానికి ప్రభుత్వం అడ్డంకులు
- పడకేసిన పారిశుధ్యం..
- పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో వ్యాపించనున్న సీజనల్ వ్యాధులు

గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదల్చడంలేదు. దీంతో గ్రామపంచాయతీల నిర్వహణ భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. గ్రామాల్లో పైపు లైన్ల మరమ్మతులు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ వంటి వాటిని కొనుగోలు చేయడానికి కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం అప్పులు చేసి మరీ పనులు చేస్తున్నారు. చేసిన అప్పులు తీర్చడం కోసం బిల్లులు సమర్పించినప్పటికీ ట్రెజరీల్లో ప్రభుత్వం చెల్లింపులు నిలిపివేసింది. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు పడుతున్న ఇబ్బందులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించకపోతే కార్యదర్శులదే బాధ్యతని అధికారులు చెప్పేస్తున్నారు. ఈ పరిస్థితిలో తమ గ్రామాలకు చెడ్డపేరు రావద్దన్న ఉద్దేశంతో కార్యదర్శులు తమ వేతనాలను సైతం గ్రామాలకు ఖర్చు చేస్తున్నారు. కొంతమంది కార్యదర్శులు చేసిన అప్పులు తీర్చలేక చేతులెత్తేస్తున్నారు.

- రంగారెడ్డి, మే 25 (నమస్తే తెలంగాణ)



గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామపంచాయతీలకు వచ్చే నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కింద ప్రతినెలా వచ్చే నిధులు కూడా ఆగిపోయాయి. దీంతో గ్రామాలకు పన్నుల వసూళ్లు తప్పా.. ఎలాంటి నిధులు రావడంలేదు. వివిధ రిజిస్ట్రేషన్లు, టాక్స్‌ల ద్వారా వచ్చే పంచాయతీ నిధులను కేవలం పారిశుధ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బందికి మాత్రమే సరిపోతున్నాయి. ఇతరత్రా పనుల కోసం వెచ్చించిన పనులకు నిధులు రావడంలేదు. పంచాయతీల్లో నిధులున్నప్పటికీ ప్రభుత్వం ఇతరత్రా పనులకు నిధులను విడుదల చేయడంలేదు. ఈ పరిస్థితిలో గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

### చెల్లింపులు నిలిపివేసిన ట్రెజరీలు

ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించి టాక్స్‌ల వసూళ్లను కార్యదర్శులు గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఖాతాల్లో జమ చేసిన డబ్బులు తిరిగి చెల్లించవద్దని ప్రభుత్వం ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ట్రెజరీలు కేవలం పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు తప్పా ఏ ఇతర బిల్లులకు కూడా చెల్లింపులకు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ కూడా భారంగా మారింది. దీంతో పలుచోట్ల ట్రాక్టర్లు డీజిల్ లేక మూలనపడ్డాయి. గత ఆరు నెలలుగా పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించకపోవడంతో వారు కూడా ఆందోళన బాట పడుతున్నారు.

### జిల్లావ్యాప్తంగా 531 గ్రామపంచాయతీలు

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 21 మండలాలు 531 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో కడ్తాల్, కొందుర్గు, కేశంపేట, మాడ్గుల, మంచాల, నందిగామ, తలకొండపల్లి, యాచారం వంటి మండలాలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలు కావడం వలన పన్నులు కూడా అంతంత మాత్రంగానే వసూళ్లవుతున్నాయి. ఈ గ్రామాలకు ఎలాంటి నిధులు చెల్లించకపోవడం వలన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పంచాయతీ కార్యదర్శులు అతి భారంగా వీటి నిర్వహణ భారాన్ని భుజాలపై వేసుకుని మోస్తున్నారు.

### పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడంలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు పత్తా లేకుండా పోయారు. దీంతో వచ్చే నెల రోజుల్లో సీజనల్ వ్యాధుల సమస్య తీవ్రంగా ఉండనున్నందున వెంటనే గ్రామీణ ప్రాంతాలవారికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



